


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

బుధవారం 22 అక్టోబర్ 2025 పేజీలు 8




## అంబాపురంలో జన్మభూమి రోడ్డుకు

# మోక్షమెుచ్చేనా?

2

- చినుకు పడితే రోడ్డంతా చిత్తడే
- ప్రతి రోజూ నరకం చూస్తున్న రైతులు
- స్మశానంలోకి వెళ్ళాలన్న బురద గోతుల్లోనే
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రోడ్డు స్థితి మారదా?
- ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలంటున్న గ్రామస్తులు



## మిస్టర్ నానీ.. దమ్ముంటే రా..

# అభివృద్ధిపై చర్చిద్దాం?

బందరు అభివృద్ధి చూసి ఓర్వలేక వ్యక్తిగత విమర్శలు?

నాడు ఆర్యశ్యులను వేధించి..నేడు ఆర్యవైశ్యుల రాగం సిగ్గుచేటు?

దశాబ్దాలుగా వ్యాపారం చేసుకునే మా కుటుంబంపై నిందలేస్తే ఊరుకునేది లేదు?

బందరు ప్రజలకు అన్యాయం చేయాలని చూసినా,

అభివృద్ధి అడ్డుకున్నా చూస్తూ ఊరుకునేది లేదని మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్

2 లో

# పూర్తి ఆరోగ్యంగా

## చిన్నారి గీతా సహస్ర



- గ్రామంలో సాధారణంగానే ప్రజల ఆరోగ్య పరిస్థితి
- ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- అవగాహన లేమితోనే సోషల్ మీడియాలో ప్రచారం
- అన్ని శాఖల అధికారులు సమర్థవంతంగా సేవలందిస్తున్నారు
- ఎవరైనా సరిగా స్పందించకుంటే కలెక్టరేట్‌కు సమాచారమివ్వొచ్చు
- పెనుగంచిప్రోలులో కలెక్టర్ లక్ష్మీశ మూడు గంటల పర్యటన

వివరాలు 7లో

# అంబాపురంలో జన్మభూమి రోడ్డుకు మోక్షమొచ్చేనా?

**చినుకు పడితే రోడ్డంతా చిత్తడే**

**ప్రతి రోజూ నరకం చూస్తున్న రైతులు**

**స్మశానంలోకి వెళ్ళాలన్న బురద గోతుల్లోనే**

**కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రోడ్డు స్థితి మారదా?**

**ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలంటున్న గ్రామస్తులు**



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ లోని పి.నైనవరం బోర్డర్ అంబాపురం సరిహద్దులు వెరసి జన్మభూమి రోడ్డు అధ్వాన్నంగా మారింది. చినుకు పడితే ఈ రోడ్డులో వెళ్లాలంటేనే నరకయాతన పడుతున్నారు రెండు గ్రామాల ప్రజలు..పట్టించుకోవాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు మౌనం పాటించడంతో అటు రైతులు ఇటు స్థానిక నివాసితులు గోతుల్లో పడి గాయాల పాలవుతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వివరాల్లోకి వెళితే అంబాపురంలో ఉన్న జన్మభూమి రోడ్డుకు ఒక ప్రత్యేకత ఉంది. నున్న వెళ్ళాలన్న లేదా రాజీవ్ నగర్ వెళ్ళాలన్న కొత్త హైవే ఎక్కాలన్న అంబాపురం, నైనవరం గ్రామస్థులు ఈ జన్మభూమి రోడ్డు నుంచే వెళ్తారు. మరోవైపు జన్మభూమి రోడ్డులోనే స్మశానం ఉంది. అదేవిధంగా రైతులకు సంబంధించిన పొలాలు ఈ రోడ్డు పక్కనే ఆనుకొని ఉన్నాయి. చినుకు పడితే ఈ రోడ్డంతా బురదమయంగా మారడంతో రైతులు నరకం చూస్తున్నారు. ఎవరైనా చనిపోయినా స్మశానంకి వెళ్ళాలంటే ఈ బురద లోనే నడుచుకుంటే వెళ్ళాల్సిన దుస్థితి. పైగా హెవీ లారీలు రాత్రుళ్ళు మట్టి తీసుకెల్తుండడంతో రోడ్లు మరింత కుంగుతుంది. బైక్ లపై వెళ్ళేవారు బురద రోడ్డులో పడి గాయాలపాలైన ఘటనలు అనేకం ఉన్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే ఇటీవల ఈ జన్మభూమి రోడ్డుకు శంకుస్థాపన కూడా 2018 లో చేశారు. దీనికి సంబంధించి అంబాపురం గ్రామం జన్మభూమి రోడ్డు నుంచి రాజీవ్ నగర్ కట్ట లోని బి టి రోడ్డు వరకు నిర్మాణం అంచనా విలువ 4 కోట్ల 35 లక్షలు కేటాయించారు. తర్వాత ఎన్నికలు రావడం మరళా వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఈ రోడ్డుకు మాత్రం మోక్షం లభించలేదు. అయితే తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు పైగానే అవుతున్నా ఈ రోడ్డుకు ఇప్పటికీ మోక్షం లభించలేదని స్థానికులు వాపోతున్నారు.

**ప్యాచ్ వర్క్‌లకు నోచుకోని వైనం**

స్థానికంగా పంచాయితీ పరిధిలో రోడ్లు పాడైనప్పుడు పంచాయితీ అధికారులే రోడ్లకు ప్యాచ్ వర్క్ లు చేపించాలి. కాని ఏళ్ళు గడిచినా ఈ రోడ్డు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు కలిసి విన్నవించుకున్న పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జోక్యం చేసుకొని జన్మభూమి రోడ్డుకు మోక్షం కల్పించాలని కోరుతున్నారు గ్రామస్థులు. చూదాలి ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ మేరకు స్పందిస్తారోనని..

# మిస్టర్ నానీ.. దమ్ముంటే రా.. అభివృద్ధిపై చర్చిద్దాం ?

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నంలో జరుగుతున్న అభివృద్ధిని, కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూడలేక పేర్ని నాని ఇష్టమొచ్చినట్లు వాగుతున్నాడని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. మచిలీపట్నంలో రోడ్ల విస్తరణపై మాజీ మంత్రి పేర్ని నాని తనపై చేసిన ఆరోపణలకు మంత్రి రవీంద్ర కౌంటర్ ఇచ్చారు. నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.

**ప్రజలను వేధించడమే పనిగా పేర్ని నాని రాజకీయ జీవితం**

పేర్ని నాని రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుండి ప్రజల్ని, వ్యాపారుల్ని వేధించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. తాను తప్ప మరెవరూ ఉండకూడదు అనేలా పేర్ని నాని వ్యవహరిస్తున్నారని, మచిలీపట్నం నుండి మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన స్వర్గీయ పెదశింగు లక్ష్మణరావును రాజకీయంగా సమాధి చేసేందుకు అతని కుమారుడికి కౌన్సిలర్ టికెట్ ఇప్పించి, అతనికి వ్యతిరేకంగా పావులు కదిపి ఓడించారన్నారు. 1999లో నడకుదిటి నరసింహారావు మంత్రిగా ఉన్నపుడు అనేక రకాలుగా వేధించారన్నారు. తర్వాత నన్ను తప్పుడు కేసులో ఇరికించి రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని ప్రయత్నించారన్నారు. పేర్ని నాని 2004లో ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నా తండ్రి, తాత 1950 సంవత్సరాల్లోనే కొనుగోలు చేసిన వ్యవసాయ భూముల్ని అసైన్డ్ భూములు అని ప్రచారం చేసి కొట్టేయాలని ప్రయత్నిస్తే.. మేము తాడో పేడో అన్నట్లు పోరాడి సాధించుకున్నామన్నారు. 2014లో ఎన్నికలకు ముందు నాపై ఇన్ కం ట్యాక్స్ తో సోదాలు నిర్వహించి వేధించారన్నారు. మచిలీపట్నంలో వేలాది మందికి ఉపాధి కల్పించిన నా కుటుంబంపై పేర్ని నాని తప్పుడు ప్రచారం చేస్తున్నాడని మంత్రి రవీంద్ర ధ్వజమెత్తారు. రైస్ మిల్స్ ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పించిన ఘనత మా కుటుంబానిదన్నారు. మచిలీపట్నంలో ఆధునాతన రైస్ మిల్లులను ఏర్పాటు చేసిన ఘనత మా నాన్నదే అని, మా మామ నడకుదిటి నరసింహారావు రాజకీయాల్లోకి రాక ముందే నవీన ఇంజనీరింగ్ వర్క్స్ కంపెనీ ఏర్పాటు చేసి వేలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. పేదల భూముల్ని బలవంతంగా లాక్కోవడంలో పేర్ని నాని నిష్ణాతుడని, 1985లో మా అన్నయ్య పెళ్లికి తిరుపతి వెళ్తే.. పేర్ని కృష్ణమూర్తి నాటి మున్సిపల్ ఛైర్మన్ బలగం పీతాంబరేశ్వరరావుకు చెందిన 440 గజాల భూమిని బలవంతంగా లాక్కున్నారన్నారు. 1997లో జిల్లా ఏడీజే కోర్టులో మాకు అనుకూలంగా తీర్పు రాగానే హైకోర్టుకు వెళ్లి వేధింపులకు పాల్పడ్డారన్నారు.

**కొనకళ్ల బుల్లయ్యతో కలిసి భూములు కొట్టేశానని చెప్పడానికి సిగ్గుపడాలి**

కొనకళ్ళ బుల్లయ్య, నేను కలిసి భూములు కొట్టేశామని చెప్పడానికి పేర్నినాని సిగ్గుపడాలన్నారు. 2009లో అగ్రిమెంట్ చేసుకుంటే దానికి మోకాలడ్డి, 2016 లో బుల్లయ్య సెటిల్ చేయడంతో అప్పుడు రిజిస్ట్రేషన్ చేశారని పేర్ని నానికి తెలియదా..? నేను మంత్రిగా ఉన్నప్పటికీ.. చట్టబద్ధంగానే నడచుకున్నాం తప్ప ఎక్కడా తప్పు చేయలేదన్నారు. ఆర్య వైశ్యుల్ని బెదిరిస్తున్నామని, వేధిస్తున్నామని పేర్ని నాని చెప్పడం హేయమన్నారు. కులం, మతం ప్రాంతం పేరుతో రాజకీయాలు చేయడంలో వైసీపీ నేతలది, పేర్ని నానిది అందెవేసిన చెయ్యి అని, నియోజకవర్గంలో నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆర్యవైశ్యులెవరికైనా అన్యాయం జరిగిందని పేర్ని నాని నిరూపించగలరా..? జెల్లూరు గోపి తమ్ముడు శ్రీధర్, ఇతర సోదరులంతా కలిసి మార్కెట్ ధరకు అమ్ముకుంటే దాన్ని కూడా తప్పుడు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. ఇందూరి బాపనయ్య అనే వ్యక్తి భూమిని ఎవరికో అమ్ముకున్నారన్నారు. దాన్ని కోర్టు పరిష్కరించిన విషయం కూడా తెలియని దిక్కుమాలిన స్థితిలో పేర్ని నాని ఉన్నాడని మండిపడ్డారు. మచిలీపట్నంలో కుటుంబ సభ్యుల మధ్య నెలకొన్న వివాదాలను కూడా నాకు అంటగట్టాలని చూస్తే చెప్పులు తెగేలా కొడతామని మంత్రి రవీంద్ర హెచ్చరించారు.

**మిస్టర్ నానీ.. దమ్ముంటే రా.. అభివృద్ధిపై చర్చిద్దాం**

మిస్టర్ నానీ.. దమ్ముంటే రా... రాజకీయంగా బందరకు నువ్వేం చేశావో. నేనేం చేశానో తేల్చుకుందాం. అంతేగానీ.. పిచ్చి పిచ్చిగా వాగి ప్రజల మధ్య విభేధాలు సృష్టించాలనుకుంటే చెప్పులు తెగేలా కొడతాం. ఎలాంటి వ్యాపారా లు లేవని చెప్పుకునే పేర్ని నానికి ఇన్ని వేల కోట్ల ఆస్తులు ఎక్కడి నుండి వచ్చాయి..? ముడా భూముల్ని అక్రమంగా తవ్వేసి లక్షల ట్రిప్పుల మట్టి తరలించడం వాస్తవం కాదా..? మంగలేరు వద్ద 7 ఎకరాల భూముల్ని లెవల్ చేయించుకున్నావ్. ఆ మట్టి ఎక్కడి నుండి తెచ్చావ్..? మైనింగ్ పర్మిట్లున్నా యా..? వాసవి వెంచర్ నీది కాదా. దాన్ని లెవల్ చేయడానికి ముడా భూములు తవ్వేయడం వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు.



**నాలా, ముడా ప్లాన్ అప్రూవల్ తోనే నిర్మాణాలు చేపట్టాం**

నాలా, ముడా నుండి ప్లాన్ అప్రూవల్ తీసుకున్న తర్వాతే నిర్మాణాలు చేపట్టాం. వాటికి అనుమతులు లేవని చెప్పడానికి సిగ్గుండాలి. 2005లో నవీన ఇండస్ట్రీస్ పేరుతో రైస్ మిల్ మిషనరీ తయారీ ప్లాంటును నా తండ్రి ఏర్పాటు చేశారు. అప్పుడు అన్ని అనుమతులు తీసుకున్నాం. ఇప్పుడూ అనుమతులు తీసుకున్నాం. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి రూ.5 కోట్లు రుణం తీసుకుని నా కుమారుడు వ్యాపారం చేసుకుంటే తప్పా..? కొత్త నిబంధనల ప్రకారం ఇచ్చిన డిమాండ్ మేరకే మా నిర్మాణాలు చేపడుతుంటే.. దాన్ని కూడా రాజకీయం చేయడం సిగ్గుచేటు అని మంత్రి అన్నారు. బైపాస్ రోడ్డులో రూ.15 కోట్ల విలువ చేసే 3800 గజాల స్థలాన్ని 2023లో అమ్ముకున్నాం. బైపాస్ రోడ్డుకు అవతల ఎకరం 50 సెంట్ల స్థలాన్ని అమ్ముకున్నాం. విజయవాడలో కొన్ని ఫ్లాట్లు అమ్ముకున్నాం. మోనికా టవర్స్ పక్కన 1.26 ఎకరాలు మేము అమ్ముకుంటే.. ఆ స్థలాన్ని తప్పుడు డాక్యుమెంట్లు పెట్టి పేర్ని నాని కబ్జా చేశాడు. ఇది నిజమో కాదో పేర్ని నాని సమాధానం చెప్పాలన్నారు.

**పేర్ని నానికి వయసు పెరిగేకొద్దీ ఇంగిత జ్ఞానం నశిస్తోంది :**

పేర్ని నానికి వయసు పెరిగే కొద్దీ.. ఇంగితం నశించిపోతున్నట్లుంది. బందరులోని రంగనాయకుల స్వామి దేవాలయానికి చెందిన భూముల్ని వేలం పెట్టించి, సిండికేట్ ఏర్పాటు చేసి కొనుగోలు చేసి, వాటిని మామయ్య, భార్య పేరుతో రాయించుకోవడం వాస్తవం కాదా..? అందులో ఉన్న హైటెన్షన్ వైర్లను కనీసం రూపాయి చలానా చెల్లించకుండా మళ్లించుకోవడం నిజం కాదా..? రోడ్డు విస్తరణ విషయంలో హడావుడి చేస్తున్న పేర్ని నానిని అడుగుతున్నా.. 2006లో రోడ్డును కొట్టేసి, 2011లో 40 అడుగులకు విస్తరించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించింది నీవు కాదా అని ప్రశ్నించారు. సమస్య ఉందని ప్రజలు చెప్పినపుడు స్థానిక ఎమ్మెల్యేగా నేను, అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లి పరిష్కరిస్తాం. గతంలో మెడికల్ కాలేజీ పేరుతో చుట్టు పక్కల ఎర్ర జెండాలు పాతిస్తే.. మేము పోరాడి రైతులకు న్యాయం చేయించామన్నారు.

**ఆర్యవైశ్య ప్రముఖులపై అత్యాచారం కేసులు పెట్టించిన చరిత్ర నీది**

ఆర్యవైశ్యులకు నీవు చేసిన ద్రోహం, దగా గురించి ప్రజలెవర్ని అడిగినా చెబుతారన్నారు. దినాల సత్రం భూముల్ని పేర్ని నాని కబ్జా చేయడం వాస్తవం కాదా..? దాన్ని ప్రశ్నించినందుకు 80 ఏళ్ల వయసు ఉన్న వైశ్య ప్రముఖులు గుడివాడ వెంకట గున్నయ్య శెట్టిపై అత్యాచారం కేసు పెట్టించిన చరిత్ర పేర్ని నానిది అని విమర్శించారు. మెహర్ బాబా, మోటమర్రి బాబాప్రసాద్, మామిడి మురళీపై అత్యాచారం కేసులు పెట్టి వేధించిన నీవు కూడా ఆర్యవైశ్యుల గురించి మాట్లాడడమేనా..? మాకు అన్యాయం జరిగిందని ఏ ఒక్కరైనా వచ్చి ఇప్పటి వరకు చెప్పడం చూశావా..? గో సంఘం కోసం దాతలు ఇచ్చిన 25 ఎకరాల భూముల్ని కొట్టేసి, నీ మనుషులకు దోచిపెట్టడం వాస్తవం కాదా..? జిల్లా పరిషత్ నుండి ఉన్న రోడ్డు విస్తరణ సమయంలో దౌర్జన్యంగా, బెదిరించి సంతకాలు పెట్టించావు. ఏ ఒక్కరికైనా పైసా ప్రయోజనం ఇచ్చావా..? బట్టల కొట్టు గాంధీ షాపులో వ్యాపారం జరుగుతున్న సమయంలోనే జేసీబీలతో కొట్టించేశావ్. కృష్ణా మోడ్రన్ డ్రెస్ షాపు ముందు పెద్ద గుంత తవ్వి వేధించడం మరిచిపోయారనుకున్నావా? జందు రాజాకి చెందిన మల్టీప్లెక్స్ వెనుక స్థలాన్ని బెదిరించి లాక్కోవడం వాస్తవం కాదా..? డీ మార్ట్ పక్కనున్న వరం మాల్ కూడా రాయించుకుంటే.. కూటమి ప్రభుత్వం ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రారంభించామన్నారు. కన్యకా పరమేశ్వరి కమిటీని వేధించి, ఆలయ ఆస్తుల్ని కబ్జా చేయడం నిజం కాదా..? అని మంత్రి రవీంద్ర పేర్ని నానిని ప్రశ్నించారు. మూడు స్తంభాల సెంటర్ నుండి రైల్వే స్టేషన్ వరకు ఉన్న రోడ్డును విస్తరించేందుకు అవసరం మేరకు అందరితోనూ చర్చలు జరుపుతున్నాం. నీలా యజమానుల్ని దగా చేయకుండా ప్రతి ఒక్కరికీ నాలుగు రెట్ల విలువైన టీడీఆర్ బాండ్లు ఇప్పిస్తాం. షాపులు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా షాపులు కేటాయిస్తాం. బెల్లంకొట్ల సందులో వ్యాపారులతో చర్చలు జరిపిన తర్వాతే ముందుకు వెళ్తున్నామని మంత్రి రవీంద్ర స్పష్టం చేశారు. పదవుల కోసం ముడుపులు తీసుకున్నామని పేర్ని నాని మాట్లాడితే చెప్పులు తెగే వరకు కొడతామని, నీలా పదవులు అమ్ముకోవడం, తండ్రి ఉండగానే దరఖాస్తులు పెట్టడం, ఛైర్మన్‌గా కౌన్సిలర్ల మేండేట్లు చింపేసి దళితుడి ఓటమికి కారణం నీవు కాదా..? డబ్బుకు పదవులు అమ్ముకునే పరిస్థితి తెలుగుదేశం పార్టీలో ఉండదని పేర్ని నాని గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కమిటీ ఆధ్వర్యంలో మాత్రమే నామినేటెడ్ పదవులు ఇస్తామని తెలుసుకోవాలన్నారు. కార్యకర్తలు, నాయకులు డబ్బులు వసూల్ చేస్తున్నారని, మట్టి తవ్వుకుంటున్నారని పిచ్చి పిచ్చిగా వాగితే ఊరుకునేది లేదన్నారు.

వాలంటీర్లతో ఇళ్లు కట్టుకునే వారిని వేధించడం వాస్తవం కాదా..? ఇంటికి చుట్టం వచ్చినా నిఘా పెట్టి అవస్థలపాలు చేయడం నిజం కాదా..? చేయాల్సిన పాపాలన్నీ చేసి.. నీతిగా ఉండే పార్టీపై నిందలేస్తే నాలుక చీలుస్తామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులంతా మచిలీపట్నం అభివృద్ధికి కట్టుబడి పని చేస్తున్నామని, బందరు అభివృద్ధిని ఛాలెంజింగ్‌గా తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే బందరు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశామని, కూటమిపై, కూటమి నాయకత్వంపై తప్పుడు ఆరోపణలు చేసి పారిపోతామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. రోడ్లపై పట్టాలేస్తే తప్పేంటి అని చెప్పిన పేర్ని నాని ఇప్పుడు అదే మాట మాట్లాడగడా..? బెల్లం కొట్టు సందులో మాది కూడా 110 గజాలు పోతోంది.ఆ విషయం పేర్ని నానికి తెలియదా అని మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుంచె నాని, తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, లంకె నారాయణ ప్రసాద్, దేవరపల్లి, పీ వి ఫణి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# దివిసీమలో ఘనంగా దీపావళి వేడుకలు





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని దివిసీమలోని పలు ప్రాంతాల్లో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తన ఇంట కుటుంబ సమేతంగా బాణాసంచా కాల్చుకుని దీపావళి వేడుకలు జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సింహాద్రి మహేష్ బాబు కుటుంబ సమేతంగా దీపావళి పండుగ చేసుకున్నారు. ఈ సందర్భంగా తమ ఇళ్ల ముందు అందమైన రంగవల్లులు వేశారు. పిండివంటలు చేసుకున్నారు. అందరూ నూతన వస్త్రాలు ధరించగా మహిళలు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. కొంతమంది నూతన బంగారు, వెండి ఆభరణాలతో లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. మరికొంతమంది పలు రకాల వంటలతో పితృ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు.

అనంతరం రాత్రికి కుటుంబ సమేతంగా బాణాసంచా కాల్చుకొని సందడి చేశారు. తొలుత పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ వ్యాపారాల నిమిత్తం వచ్చిన మార్వాడీలు, రాజస్థానీ కుటుంబాల వారు దీపావళిని అత్యంత భక్తి ప్రభత్లతో జరుపుకున్నారు. ఎక్కడెక్కడో ఉద్యోగాలు, ఉపాధి కోసం వెళ్లిన వారందరూ తమ ఇళ్లకు చేరుకుని పండుగ చేసుకోవడంతో ఇళ్లన్నీ బంధువులతో సందడిగా మారాయి.

# పార్టీ కార్యాలయాలలో ఘనంగా దీపావళి వేడుకలు





**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు లోని నియోజకవర్గ జనసేన పార్టీ కార్యాలయంలో దీపావళి సంబరాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ పార్టీ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్ ఆధ్వర్యంలో కార్యాలయం వద్ద బాణాసంచా కాలుస్తూ ఆ పార్టీ నాయకులు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో రాపర్ల ఎంపిటిసి సభ్యులు కూనపరెడ్డి సుబ్బారావు, పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో....** పామర్రు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూడా దీపావళి పండుగ వేడుకలను అత్యంత వైభవంగా జరిపారు. స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా సోదరుడు వర్ల చైతన్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆనందోత్సాహాలతో టపాసులు కాల్చారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చాట్ల రమేష్, పానుగంటి సందీప్, రామాంజనేయులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయిలో కొమ్మారెడ్డి విద్యార్థుల ప్రభంజనం

**బంటుమిల్లి మేజర్ న్యూస్ :** తమిళనాడు రాష్ట్రం చెన్నై డి.బి.జైన్ కాలేజ్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 12 తేదిన జరిగిన 4వ ఆల్ ఇండియా మవాటేకా షితోరియూ ఓపెన్ ఆన్లైన్ కరాటే ఛాంపియన్ షిప్ – 2025లో వివిధ రాష్ట్రాల నుండి సుమారు 500 మంది పైన విద్యార్థులు పాల్గొన్నారు. అందులో కొమ్మారెడ్డి విద్యార్థులు పాల్గొని వివిధ పతకాలు సాధించారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు పి. యోక్షిత (6వ తరగతి)11 సం.ల కటా విభాగంలో ప్రథమ స్థానం కె.యల్.జి.యస్. హర్షిణి (5వ తరగతి) 10 సం.ల కటా విభాగంలో ప్రథమ స్థానం యమ్.డి. ఫర్హాన్ ఖాన్ (4వ తరగతి) 9 సం.ల కటా విభాగంలో ద్వితీయ స్థానం పి.యు.వి. కార్తీక్ (2వ తరగతి) 7 సం.ల కట విభాగంలో తృతీయ స్థానం జి. సిరి (5 వ తరగతి) 10 సం.ల కటా విభాగంలో తృతీయ స్థానంలో పథకాలు సాధించారు.ఇంతటి అద్భుత ప్రతిభ కనబరచి విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ స్కూల్ సెక్రెటరీ, కరెస్పాండెంట్ కె.యస్.వి.జి. శోభ,యంగ్ డైరెక్టర్ కొమ్మారెడ్డి చైతన్య, వైస్ ప్రిన్సిపాల్ కొమ్మారెడ్డి హరణి స్కూల్ హెచ్ఎం. ఎన్. శ్రీనివాసరావు, కరాటే కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, పలువురు తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందించారు.

## చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతం దీపావళి



**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** మరుగున పడిన సాంప్రదాయ గంగిరెద్దుల మేళాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి దీపావళికి పాల్గొంటున్నామని నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. బాపులపాడు మండలం, రంగన్నగూడెం గ్రామంలో దీపావళి సందర్భంగా ప్రతి ఏటా ఆనవాయితీగా జరిగే సాంప్రదాయ గంగిరెద్దుల మేళంలో రంగన్నగూడెం మాజీ సర్పంచ్ మణికృష్ణ దంపతులతో ఆయన పాల్గొని కళాకారులకు కానుకలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆళ్ళ గోపాలకృష్ణారావు మాట్లాడుతూ గత వై.సి.పి. విధ్వంసక పాలన అనే చెడు నుంచి కూటమి ప్రభుత్వమనే మంచి సాధించిన విజయమే నిజమైన దీపావళి అని నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. రాష్ట్రంలో ఎన్.డి.ఎ. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలకు ఆరోగ్యం, ఆదాయం, ఆనందం అందించిన అసలుసిసలు దీపావళి ఇదేనని అన్నారు. ఎన్.డి.ఎ. ప్రభుత్వం 16 నెలల పాలనలో ఏడాదికి 33,600 కోట్లతో ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్ పథకం, 10 వేల కోట్లతో తల్లికి వందనం, 3,173 కోట్లతో అన్నదాత సుఖీభవ మొదటి విడత, 2,684 కోట్లతో 2 కోట్ల రాయితి గ్యాస్ సిలెండర్లు, స్త్రీశక్తి పేరిట మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆటోడ్రైవర్లకు భరోసా, అన్న క్యాంటిన్లు తదితర సంక్షేమ కార్యక్రమాలను అందించటం జరిగిందని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహాయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దశదిశ నిర్దేశంతో, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువ నాయకులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం, ప్రజల రాజధాని అమరావతి నిర్మాణం శరవేగంగా జరుగుతోందని ఎన్.డి.ఎ. ప్రభుత్వంలో "సూపర్ జి.ఎస్.టి. – సూపర్ సేవింగ్స్" ద్వారా ఒక్కొక్క కుటుంబానికి ఏడాదికి 15 వేల రూపాయలు ఆదా అవుతుందని, అలాగే గన్నవరం నియోజకవర్గంలో శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో మల్లవల్లి పారిశ్రామిక వాడలో లైలాండ్ కంపెనీ పునరుద్ధరణతో పాటు నిరుద్యోగ యువతకు 10 వేల ఉద్యోగాలు ఇప్పటికే వచ్చాయని గన్నవరం నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో మోడల్ నియోజక వర్గంగా అభివృద్ధి చేయటానికి పనులు వేగంగా జరుగుతున్నాయని ఇలాంటి మంచి ప్రభుత్వానికి ప్రజలందరు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు.





## కలెక్టర్ ఇంట హరిత దీపావళితో ఆనంద హేళ

**విజయవాడ, అక్టోబర్ 21, మేజర్ న్యూస్ :** సోమవారం రాత్రి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ విడిది కార్యాలయంలో హరిత దీపావళితో ఆనందోత్సాహలు వెల్లివిరిశాయి. కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు, దీప కాంతుల వెలుగులో పండగను ఉత్సాహంగా జరుపుకున్నారు. పర్యావరణహిత దీపావళిని జరుపుకుంటూ ఆదర్శవంతంగా నిలిచారు. పర్యావరణ పరిరక్షణకు, మానవ ఆరోగ్యానికి రెండింటికీ స్వచ్ఛమైన గాలి అత్యంత అవసరమని.. వాయు కాలుష్యాన్ని కట్టడి చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాల్సిన అవసరముందని, అధికారులు కూడా పర్యావరణానికి హానికలిగించే టపాసులకు దూరంగా ఉండాలని, తాను కూడా హరిత దీపావళిని జరుపుకుంటానని ఇటీవల క్లీన్ ఎయిర్ ఇతివృత్తంతో జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం హరిత దీపావళిని జరుపుకుని ఆదర్శవంతంగా నిలిచారు.

## ఆనందోత్సహాల నడుమ దీపావళి





**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** కోటి కాంతుల్లో దీపావళి పండుగను అన్ని వర్గాల ప్రజలు ఆనందోత్సహాలతో జరుపుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలను నిర్వహించి పిండి వంటల్ని చేశారు. పిల్లల నుంచి వద్ధుల వరకు టపాసులను కాల్చేందుకు ఆసక్తి కనబరిచారు. టపాసులు కాలుస్తున్న పిల్లల కళ్లల్లో ఆనంద కాంతుల్ని చూసి తల్లిదండ్రులు ముచ్చట పడ్డారు.

## శ్రీ జ్ఞానసాయి సన్నిధిలో దీపావళి



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో దీపావళిని పురస్కరించుని ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మందిర ప్రధాన నిర్వాహకులు యలమంచి నాగమోహన్, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో 27రకాల ద్రవ్యాలతో జ్ఞానసాయికి విశేషాభిషేకాలు చేశారు. బాబావారి గ్రామోత్సవాన్ని వెండి పల్లకీలో చేపట్టారు. ఈ ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమాల్లో నిర్వాహకులు దుగ్గిరాల ఆంజనేయప్రసాద్, నాగవల్లీ, తిపిర్నేని రాజా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంటేశ్వరుని సన్నిధిలో దీపావళి పూజలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్:** మండలంలోని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి సన్నిధిలో దీపావళి పూజలను వైభవంగా నిర్వహించారు. వెంకటేశ్వరునికి వేద మంత్రోచ్ఛరణ నడుమ వేద పండితులు విశేషాభిషేకాలు చేపట్టారు. అధికసంఖ్యలో భక్తులు విచ్చేసి అన్న ప్రసాదాలను స్వీకరించారు. మెయిల్ అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వెంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి భక్తిప్రపత్తులతో స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.





## పురమిత్ర యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా నగర ప్రజలకు పురపాలక సేవలను సులభతరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని నగర కమిషనర్ చోడే వీర వెంకట సత్య బాపిరాజు తెలిపారు. మచిలీపట్నం నగర ప్రజలు ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ప్లే స్టోర్ లో యాప్ ను డౌన్లోడ్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ,పురమిత్ర యాప్ ద్వారా ప్రజలు మున్సిపల్ సేవలు, ఫిర్యాదులు, పన్ను చెల్లింపులు, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు వంటివి దాదాపు 122 పురపాలక సేవలు పొందవచ్చు అన్నారు. ప్రజలు తమ ఫిర్యాదులతో పాటు ఫోటోలను కూడా అప్లోడ్ చేయవచ్చని తెలిపారు. వీధి దీపాలు, చెత్త పేరుకుపోవడం, రెవిన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అంశాలపై ఫిర్యాదులు, సేవల కోసం దరఖాస్తు, వాటి పరిష్కార స్థితిని తెలుసుకోవడానికి ట్రాకింగ్ కూడా ఉంటుందన్నారు. ఫిర్యాదులు, సేవలు పరిష్కారానికి నిర్దేశిత గడువు ఉంటుందన్నారు. ఆస్తి పన్ను, నీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, డ్రైనేజ్ చార్జీలు, ఆస్తి పన్ను, మ్యుటేషన్ ఫీజు, షాప్ లీజులు, అగ్రిమెంట్ ఫీజులు, ప్రకటనల పన్నులను యాప్ ద్వారా ఇంటి వద్ద నుంచే చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే వారం నుంచి వార్డు సచివాలయాల వారీగా ప్రజలకు యాప్ డౌన్లోడ్ వినియోగంపై అవగాహన కలిగిస్తామని కమిషనర్ ప్రకటించారు.

## విద్యే సమాజాన్ని మార్చగల శక్తి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బెల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆఫీస్ మచిలీపట్నం వడ్డీ రంగారావు నగర్‌కి చెందిన తుమ్మలగుంట అమ్ములు ఒంటరి మహిళగా జీవిత పోరాటం కొనసాగిస్తున్నారు. గృహ కార్యాల ద్వారా సంపాదన చేసుకుంటూ తన కుమార్తె చిరంజీవి హసీనాను చదివిస్తూ వస్తున్నారు. హసీనా ప్రస్తుతం శ్రీ పద్మావతి మహిళా కళాశాల, మచిలీపట్నంలో ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసి చదువుతోంది. తల్లికి ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్న నేపథ్యంలో విద్యాభ్యాస ఖర్చులు భరించలేని స్థితి ఏర్పడింది. ఈ విషయం తెలుసుకున్న మచిలీపట్నం మైత్రి ఫౌండేషన్ సభ్యులు స్పందించి, కాలేజీ పేరిట 9,000 రూపాయిలు విద్యా ఫీజు సాయం అందించారు. సాయం అందుకున్న విద్యార్థిని హసీనా మాట్లాడుతూ,నేను పేద కుటుంబానికి చెందిన విద్యార్థిని అయినప్పటికీ, నా చదువును కొనసాగించాలనే తపన ఎప్పుడూ ఉంది. ఈ కష్టకాలంలో నాకు అండగా నిలిచిన మైత్రి ఫౌండేషన్ సభ్యులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీ సాయం వల్ల నా భవిష్యత్తు మార్గం మరింత బలపడింది. నేను కూడా చదువు పూర్తిచేసి, భవిష్యత్తులో ఇలాంటి స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా నా వంటి పేద విద్యార్థులకు తోడుగా నిలవాలని ఆశిస్తున్నాను. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు కేసాని వేణుకుమార్ మాట్లాడుతూ విద్యే సమాజాన్ని మార్చగల శక్తి. విద్యార్థులలో విద్య కొనసాగాలనే తపన ఉంటే,ఆ మార్గంలో మైత్రి ఫౌండేషన్ ఎప్పుడూ అండగా ఉంటుంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఏ.ఆర్.కే. వరప్రసాద్,ఫుడ్ కమిటీ చైర్మన్ అనిల్, సభ్యులు రామకృష్ణ మాస్టారు,సుధీంద్ర కుమార్ పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరులకు గుడ్లవల్లేరులో ఘననివాళి



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్:** పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా గుడ్లవల్లేరు పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ఎన్ వి వి సత్యనారాయణ, ఎఎస్ఐ వెంకటేశ్వరరావు, పోలీసు సిబ్బంది మంగళవారం పోలీసు అమర వీరులకు ఘన నివాళులు అర్పించారు. అలానే అమరవీరుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# సెల్ ఫోన్ వినియోగం తగ్గించుకోండి





### డాక్టర్ జి. భానుమూర్తి

### పేదవారికి ఉచితంగా అందించే వైద్య సేవలు మాధవ సేవతో సమానం : లంకిశెట్టి బాలాజీ

మచిలీపట్నం మేజర్ న్యూస్ : వయసుతో నిమిత్తం లేకుండా సెల్ ఫోన్ వినియోగం తగ్గించుకోవాలని లేకపోతే వాటి ప్రభావం కంటిపై పడుతుందని కృష్ణాజిల్లా అందత్వ నివారణ అధికారి, మచిలీపట్నం జిల్లా సర్వజన ఆస్పత్రి ప్రముఖ నేత్ర వైద్యులు జి. భానుమూర్తి అన్నారు. మచిలీపట్నం మోడరన్ ఐ కేర్ నిర్వాహకులు మహమ్మద్ నియాజ్ ఆధ్వర్యంలో ఇంగ్లీష్ పాలెం ఉర్దూ షాదిఖానాలో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి డాక్టర్ భానుమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై ఉచిత సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ భానుమూర్తి మాట్లాడుతూ మారుతున్న సమాజంలో చంటి పిల్లలకు సెల్ ఫోన్ చూపించి ఫీడింగ్ ఇస్తున్నారని అది మంచి పద్ధతి కాదు అని అన్నారు. యువత ఎక్కువ సమయం సెల్ ఫోన్ ఉపయోగించడం వలన వయసు పెరిగిన తర్వాత దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని అన్నారు. సెల్ ఫోను అత్యవసర సమయాల్లోనే ఉపయోగించాలని, చీకట్లో సెల్ ఫోన్ వినియోగం మరింత ప్రమాదకరమని అన్నారు. ప్రతి ఒక్కరు కంటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ముఖ్యంగా షుగర్ ఉన్న పౌరులు ప్రతి ఆరు నెలలకు చికిత్స పరీక్షలు పొందాలని అన్నారు. మెరుగైన కంటిచూపు కోసం పాలు, గుడ్లు, ఆకుకూరలు వంటి పోషక పదార్థాలు తీసుకోవాలని అన్నారు. మరో వైద్యులు సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ కాగిత రాకేష్ మాట్లాడుతూ న్యూరో కేసులు కూడా విపరీతంగా పెరుగుతున్నాయని అన్నారు. ముఖ్యంగా మెదడులోని కణి తలు,తలకు గాయాలు, మూర్ఛ,మెడనొప్పి, నడుము నొప్పి, కళ్ళు తిరగటం పార్కిన్సన్ సంబంధిచిన జబ్బులు ఉన్నప్పుడు ప్రాథమిక స్థాయి నుండే మందులు వాడి నివారణ చేసుకోవచ్చని అన్నారు. నరాల పనితీరు అంచనా వేయటానికి ఎలక్ట్రోమాయో గ్రాఫి పరీక్షలు అవసరం కావచ్చని అన్నారు. నరాల బలహీనత ఉన్నవారు విటమిన్లు ఖనిజాలు పుష్కలంగా ఉండే నారింజ జామ బెర్రీలు వంటి పండ్లు కూరగాయలు ధాన్యాలు ఎక్కువగా తీసుకోవాలని, మెగ్నీషియం అధికంగా ఉండే ఆహారాలు కూడా ఉంటాయని అన్నారు. నరాలు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, మెదడు పనితీరు మెరుగుపరచడానికి క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం తగినంత నిద్ర, విశ్రాంతి తీసుకోవడం అవసరమని అన్నారు. మరో న్యూరో సర్జన్ డాక్టర్ పరస లక్ష్మీ భావన మాట్లాడుతూ సరైన పోషక పదార్థాలు తీసుకోకపోవడం వలన రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోవటం తగిన వ్యాయామం నడక లేకపోవడం వలన యువతలో ఎక్కువగా నరాలకు సంబంధించిన వ్యాధులు వస్తున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ నరాలు సంబంధించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని లేకపోతే పక్షవాతం వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. ధూమపానం మద్యం కు దూరంగా ఉండాలని సూచించారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ ప్రతి వైద్యుడు తమ సమయంలో కొంత సమాజం పేదవారికి కేటాయించవలసిన అవసరం ఎంతైనా ఉందని, పేదవారికి ఉచితంగా అందించే వైద్య సేవలు మాధవ సేవతో సమానమని అన్నారు. నేడు ఉచిత మెడికల్ క్యాంపులో పేదవారికి కాగిత రాకేష్,పరసా లక్ష్మీ భావన ఖరీదైన మందులను ఉచితంగా అందించడం అభినందనీయమని బాలాజీ అన్నారు. కృష్ణాజిల్లా మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరస మధుసూదనరావు మాట్లాడుతూ జిల్లా ముఖ్య కేంద్రం మచిలీపట్నంలో పేదవారి కోసం మోడ్రన్ ఐ కేర్ ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి సీనియర్ డాక్టర్లతో ఉచితంగా వైద్యము మందులు అందించడం ఆదర్శమైన కార్యక్రమమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ హసిమ్ బేగ్ మాటలతో దీపావళి పండుగ రోజున డాక్టర్లు తమ కుటుంబంతో కాకుండా సమాజానికి ఉపయోగపడే విధంగా వైద్య శిబిరంలో పాల్గొని ఉచితంగా మందులు అందించటం సంతోషదాయకమన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బావ ప్రసాద్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో వైద్యం అందిన పేదవారికి ఈ విధమైన ఉచిత మెగా శిబిరాలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని అన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు వైద్య శిబిరం నిర్వహించి సుమారు 300 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన మోడరన్ ఐ కేర్ యజమాని ఎండి. నియాజ్‌ను అందరు అభినందించారు.

## పామర్రు లో ఇంటి వద్ద కోటి సంతకాల సేకరణను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కైలే



పామర్రు మేజర్ న్యూస్ : నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మాజీ శాసనసభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ ప్రారంభించారు. అనిల్ కుమార్ ఇంటి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 24న శ్రీకొండలమ్మ ఆలయ హుండీ లెక్కింపు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ అక్టోబరు 21 :** గుడ్లవల్లేరు మండలం, వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలు ది.24.10.2025 తేదీ శుక్రవారం ఉదయం 09:00 గంటల నుండి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులు, డిపార్టుమెంటు అధికారులు, గ్రామస్తులు, సేవకులు, సిబ్బంది సమక్షములో ఆలయ మండపములో లెక్కింపు జరుపబడునని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు.

# బీవీఆర్ యూత్ సేవా కార్యక్రమాలు






**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** తోట్లవల్లూరు మండలం గరికపర్రు గ్రామానికి చెందిన బి.వి.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ అధినేత బొమ్మారెడ్డి వెంకటరెడ్డి పుట్టినరోజు సందర్భంగా బి.వి.ఆర్ యూత్ బోలెం కోటేశ్వర రావు(కోటి) వీరంకి బాలగౌడ్ ఆధ్వర్యం లో మంగళవారం ఉదయం స్థానికంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

ఇక్కడి శ్రీ కోదండ రామాలయంలో విశేష పూజలు హోమాలతో పాటు, కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్.టి.ఐ రాష్ట్ర కో కన్వీనర్, గురజాడ మాజీ సర్పంచ్ జంపాన శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. తోట్లవ ల్లూరులోని లయన్స్ క్లబ్ అనాధల సేవా నిలయం వీరంకిలాకు శిరీషతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో పలువురు పేదలకు బివిఆర్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మూరు సర్పంచ్ బొమ్మ రెడ్డి వెంకట్ రెడ్డి,బివిఆర్ యూత్ విభాగం ప్రతినిధులు బయ్యవరపు దుర్గాప్రసాద్, నువ్వే పార్టీ ఏ కోస్తా జిల్లాల కన్వీనర్ పేతపూడి జోగేశ్వరరావు, బి.శివ పార్వతిపొట్లూరి గోపాలకృష్ణ, మరీదు జలధర్ శ్యామ్ కె.కరుణాకర్, వీరంకి పవన్, వెలివేల నాగరాజు, బి.రామకృష్ణ బివిఆర్ యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# దాత సహకారంతో హిందు, దళిత స్మశాన వాటికల అభివృద్ధి



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీకి చెందిన సీనియర్ నాయకులు అందించిన దాతృత్వంతో మండల పరిధిలోని చిరాకుల్లిపాట చిన్న పులిపాక గ్రామంలో గల హిందు, దళిత స్మశాన వాటికల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఉమ్మడి కృష్ణా జిల్లా తెలుగు యువత అధ్యక్షులుగా పనిచేసిన రామినేని వెంకట కుటుంబ నరసింహారావు (కుటుంబయ్య) ఆర్థిక సహకారం అందించగా ఈ స్మశాన వాటిక అభివృద్ధి పనులను ప్రారంభించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరపనేని శివరామ ప్రసాద్ ఈ పనులను ప్రారంభించారు. గ్రామానికి చెందిన పలువురు స్మశాన వాటికల దుస్థితిని తన దృష్టికి తీసుకురాగా వాటిని అభివృద్ధి పరిచేందుకు విరాళం అందిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చినట్లు ఈ సందర్భంగా కుటుంబయ్య తెలిపారు. సుమారు మూడు ఎకరాలకు పైగా ఉన్న ఈ స్మశానాల అభివృద్ధికి సుమారు రెండు లక్షల రూపాయల వ్యయం అవుతుందని, ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న స్మశాన వాటికలను వాడుకలోనికి తీసుకొస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబయ్యతో పాటు బొడ్డపాడు గ్రామ సర్పంచ్ మూడే శివశంకరరావు, రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు చింతపల్లి వెంకటేశ్వరరావు, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరీదు నాగేశ్వరావు, గ్రామస్తులు ధర్మారావు, తిరుపతయ్య, మార్గం శ్రీరామమూర్తి, బెజవాడ వెంకటేశ్వరరావు, పరిసే ఆరోగ్యం, పాగోలు కొండలరావు, ఆయుధం ముసలయ్య, కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య విద్య సామాన్యులకు అంద కూడదని కూటమి కుట్ర



**మొవ్వ మేజర్ న్యూస్ :** బడుగు బలహీన, దళిత, గిరిజన, మైనార్టీ విద్యార్థులకు వైద్య విద్య అందకూడదనే అక్కస్సుతో ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేటీకరణ చేసి ఆయా వర్గాలకు అన్యాయం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తోందని పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే.అనిల్ కుమార్ ఆరోపించారు. మంగళవారం మండల పరిధిలోని కాజా గ్రామంలో ప్రభుత్వ వైద్య కళాశాలు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణలో భాగంగా బ్రోచర్లను అనిల్ కుమార్ వీడియోలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 17 నెలలైనా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ఘోర విఫలం చెందిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో 17 ప్రభుత్వ వైద్య కళాశాలు తీసుకొచ్చి బడుగు బలహీన దళిత గిరిజన మైనారిటీ విద్యార్థులకు వైద్య విద్య సులభతరంగా అందేందుకు కృషి చేసారని కానీ కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలను ప్రైవేటుపరం చేసేందుకు కుట్రలు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ ఆపకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అనిల్ కుమార్ హెచ్చరించారు. తొలుత మండల పరిధిలోని నిడుమోలు గ్రామంలో మైనార్టీ నేతలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరడంతో అనిల్ కుమార్ వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నేతలు పాల్గొన్నారు.





# ఘనంగా మాజీ ఎమ్మెల్యే వంశీ జన్మదిన వేడుకలు

**గన్నవరం, అక్టోబర్ 21, మేజర్ న్యూస్ :** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ జన్మదిన వేడుకలను నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఉంగుటూరు మండలం అత్కూరులో వైసీపీ నేత కోటా చంటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పేద ప్రజల అభివృద్ధి కోసం పనిచేసే వ్యక్తి వల్లభనేని వంశీ అన్నారు. అధికారం వున్నా లేకపోయినా ఆయన అభిమానులుగా జన్మదిన వేడుకలు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో వంశీ మళ్ళీ అధికారంలోకి వచ్చి ప్రజలకు సేవ చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 300 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొమ్ము కిరణ్, షేక్ బుడే, వల్లూరి శ్రీనివాస్, కుర్రా సుబ్బారెడ్డి, మెండెం రాంబాబు, సొంగ నరేంద్ర, బోరా వెంకటరెడ్డి, టి. ప్రసాద్, మల్లిరెడ్డి రాజేష్, తమలం దాసు బాబు, పాతపాటి నాగబాబు, బూతపాటి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

# 24న మదర్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఐక్యరాజ్య సమితి దినోత్సవం

## పోస్టర్ ఆవిష్కరించిన తాసిల్దార్ జె సుశీల దేవి



**రెడ్డిగూడెం, అక్టోబర్ 21, మేజర్ న్యూస్ :** అక్టోబర్ 24 ఐక్యరాజ్య సమితి దినోత్సవం పురస్కరించుకొని అంతర్జాతీయ గుర్తింపు పొందిన మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రెడ్డిగూడెం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తూ ఈ కార్యక్రమంలో నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ చేస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు డాక్టర్ మల్లాది ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి దినోత్సవ వార్షికోత్సవం పోస్టర్ ను రెడ్డిగూడెం మండల మేజిస్ట్రేట్, తహశీల్దార్ జె. సుశీల దేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ 24న ఐక్యరాజ్యసమితి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటారు. అంతేకాదు ఈ రోజు ప్రాముఖ్యత, ఏవిధంగా ఏర్పాటైంది తదితర విషయాలను స్మృతి పథంలోకి తీసుకురావడమే కాక రాబోయేతరాలకు చాటి చెప్పేలా ఈ దినోత్సవాన్ని అన్ని దేశాలు కలిసి ఘనంగా నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవ సంస్థ సామాజిక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో పాటు ప్రపంచ దేశాల మధ్య శాంతి, భద్రత, సహకారం, అభివృద్ధిని ప్రోత్సహించే ఐక్యరాజ్యసమితి లక్ష్యాలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ తెలియజేయడం కోసం ఐక్యరాజ్యసమితి వార్షికోత్సవం కార్యక్రమాలు ఏర్పాటు చేయటం చాలా అభినందనీయమని ఈ సందర్భంగా మదర్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవ సంస్థ కమిటీని తాసిల్దార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ జి పుల్లయ్య. సంస్థ కోఆర్డినేటర్ సిహెచ్ అశోక్ కుమార్. రిపోర్టర్ వనపర్ల ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



# టీడీపీ నుండి వైసీపీలో చేరిన మైనార్టీ నాయకులు

## పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే కైలే

**పామర్రు మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మొవ్వ మండలం నిడుమోలు గ్రామానికి చెందిన పలువురు మైనార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ నుండి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కైలే అనిల్ కుమార్ ఇంటి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీలో చేరుతున్న మైనార్టీ నాయకులకు అనిల్ కుమార్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో లభిస్తున్న ఆదరణకు ఇది సంకేతమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన ఆ పార్టీ 17నెలల్లోనే ప్రజాగ్రహానికి గురైందన్నారు. అబద్ధపు హామీలు ఇచ్చి, మోసపూరిత మాటలతో చంద్రబాబునాయుడు ప్రజల్ని నిలువునా దగా చేశారని విమర్శించారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజలు పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఈ రాష్ట్రానికి జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్న ఆకాంక్ష ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకి రాబోయే రోజుల్లో సముచిత గౌరవం కల్పిస్తామని తెలిపారు.

# ఈదుల మద్దాలిలో కోటి సంతకాల సేకరణ



**పెదపారుపూడి మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని ఈదులమద్దాలి గ్రామంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి, మండల పార్టీ అధ్యక్షులు గోగం సురేష్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఆల రమేష్, జిల్లా పార్టీ స్పోక్స్ పర్సన్ చీకుర్తి వరప్రసాద్, మండలపార్టీ ప్రధాన కార్యదర్శులు పేటేటి ఆదియ్య, తోట యామిని, పార్టీ సీనియర్ నాయకులు గోళ్ళ సోమేశ్వరరావు, ముల్పూరి చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ వి.హెచ్.విష్ణుకుమారి, గ్రామ నాయకులు చంద్రరావు, రామకృష్ణ తదితరులతోపాటు మండలంలోని నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఆకుమర్రు పంచాయతీలో

# విద్యార్థులకు వైద్య పరీక్షలు



**పెడన/గూడూరు, మేజర్ న్యూస్:** గూడూరు మండలం మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆకుమర్రు పంచాయతీ ఎం పి యు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆర్ బి ఎస్ కె (రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం) ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు జరిగిన జరిగినకార్యక్రమంలో ఆర్ బి ఎస్ కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హిమబిందు పర్యవేక్షణలో విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు జరిపారు. పరీక్షల్లో ఆరోగ్య సమస్యలు గల విద్యార్థులను ఆశా వర్కర్ ద్వారా ఆర్ బి ఎస్ కె వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్స అందించారు. మందులు ఇచ్చిన అనంతరం విద్యార్థులను తిరిగి పాఠశాలకు తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి వాహబ్ హెల్త్ సిబ్బంది హెచ్ ఎస్ బాబురావు ఏఎన్ఎంలు సుకన్య కరుణ ఆశ వర్కర్ అనసూయ తదితరులు ఉన్నారు.

## పురమిత్ర యాప్ ద్వారా మీ సమస్యను వెంటనే పరిష్కరించుకోవచ్చు

### నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ యం



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం పురమిత్ర యాప్ ని అందుబాటులోకి తెచ్చిందని, నగర ప్రజలు ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ప్లే స్టోర్‌లో డౌన్లోడ్ చేసుకొని, నగరపాలక సంబంధిత సమస్యలను త్వరగా పరిష్కరించుకోవచ్చుని, పురమిత్ర యాప్‌ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ధ్యానచంద్ర హెచ్‌యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పురమిత్ర యాప్ ద్వారా ప్రజలు మున్సిపల్ సేవలు, ఫిర్యాదులు, పన్ను చెల్లింపులు, జనన, మరణ, వివాహ ధృవీకరణ పత్రాలు వంటి దాదాపు 122 పురపాలక సేవలు పొందవచ్చున్నారు. సమస్యలను ఫిర్యాదుతో పాటు ఫొటోలను కూడా అప్ లోడ్ చేయవచ్చని తెలిపారు. వీది దీపాలు, చెత్త పేరుకుపోవడం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్ అంశాలపై ఫిర్యా దులు, సేవల కోసం దరఖాస్తు, వాటి పరిష్కార స్తితిని తెలుసుకోవానికి ట్రాకింగ్ కూడా ఉంటుందన్నారు. ఫిర్యాదులు, సేవల పరిష్కారానికి నిర్దేశిత గడువు ఉంటుందన్నారు. ఆస్తి పన్ను నీటి చార్జీలు, డిఇఓ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు, డ్రైనేజి చార్జీలు, ఆస్తి పన్ను మ్యూటేషన్ ఫీజు, షాప్ లీజులు, అగ్రిమెంట్ ఫీజులు, అడ్వర్టైజ్మెంట్ ట్యాక్స్ లను యాప్ ద్వారా ఇంటి వద్ద నుండే చెల్లించే అవకాశం ఉందని తెలిపారు. వచ్చే వారం నుండి వార్డ్ సచివాలయాల వారిగా ప్రజలకు యాప్ డౌన్లోడ్, వినియోగంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

## వాలీబాల్ సీనియర్ అండర్-17 విభాగం జిల్లా జట్టుకు కుంచె దివ్య ఎంపిక



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** చల్లపల్లి ఎస్.ఆర్.వై.ఎస్.పి హైస్కూల్ విద్యార్థిని కుంచె దివ్య వాలీబాల్ సీనియర్ అండర్-17 విభాగం జిల్లా జట్టుకు ఎంపికైంది. ఈ నెల 22వ తేదీ గుడివాడలో జరిగే పోటీల్లో పాల్గొననుంది. అండర్-14 జట్టుకు అద్దంకి హారిక, యూ.దుర్గా శ్రీవల్లి, గంజాల అశ్విని, భోగాది సుస్మిత ఎంపికయ్యారు. వారిని హైస్కూల్ హెచ్ఎం సుదర్శన్, నోడల్ అధికారి రేణుప్రసాద్, పీఈటీ శ్రీనివాస్ అభినందించారు. వారికి అవసరమైన టీ-షర్టులను ఎస్.ఆర్.వై.ఎస్.పీ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ తరపున విశ్రాంత ప్రిన్సిపాల్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు తగిరిశ సాంబశివరావు అందచేశారు. కార్యక్రమంలో పీఈటీ శ్రీనివాస్, పాగోలు దుర్గా ప్రసాద్, ఆఫీస్ సూపరిటెండెంట్ శాస్త్రి పాల్గొన్నారు.

## అమరవీరుడు షేక్ హాజీ హుస్సేన్‌కు ఘన నివాళి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** విధి నిర్వహణలో అశువులు బాసిన వీర జవాన్ షేక్ హాజీ హుస్సేన్ స్థూపం వద్ద ఘన నివాళులు అర్పించారు. మంగళవారం అమరవీరుల స్మృతి దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలోని హాజీ హుస్సేన్ స్థూపం వద్ద 56వ బెటాలియన్ ఐ టి పి పి ఫోర్స్ కమాండెంట్ శ్రీహరి సింగ్ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఐ.టి. బీ.పీ( ఇండో టిబెటియన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్)లో పనిచేసిన షేక్ హాజీ హుసేన్ తన కర్తవ్య నిర్వహణలో మంచు కొండల్లో 2019లో అమరుడయ్యాడు. అమరవీరుల దినోత్సవం పురస్కరించుకుని అమర జవాన్ షేక్ హాజీ హుస్సేన్ చదువుకున్న జడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో ఏర్పాటుచేసిన స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అమర జవాన్ తల్లి తండ్రులు షేక్ మహబూబ్,షకీనా బేగలను ఆర్మీ, అవనిగడ్డ పోలీసు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 56 బెన్ ఐటీబి కమాండ్ ఫోర్స్ విశాఖపట్నం ఏఎస్ఐ కరమ్ డెన్, హెడ్ కానిస్టేబుల్ శ్రీను, సిటి సుంబర్యా,అవనిగడ్డ పోలీసు సిబ్బంది. రౌతు జీవన్,స్వామి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మత్తి నాగమల్లేశ్వరరావు, రఘు, వీరకుమార్, రామలక్ష్మి, ఉదయకుమార్, కనకరావు, యాసం రామతులసి, మొగల్ మురాద్ బేగ్, కాలిల్, కదీరా, భాషా, మసీదు గురువు, నారేపాలెం శివరామకృష్ణ, అవనిగడ్డ కిరణ్, శివకుమార్,ఆది విజయ్, తులసి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సాఫల్యంతో... ప్రజల సంతోషం

### టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్



**విజయవాడ తూర్పు, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు చోటుచేసుకున్నాయని, ప్రభుత్వం సాఫల్యంతో ప్రజలు సంతోషంగా పండుగలు జరుపుకుంటున్నారని టిడిపి యువనేత గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 9వ డివిజన్ పటమటలంకకు చెందిన జక్కా లక్ష్మి ఆమె గృహానికి పైకప్పు లేక ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ను కలిసి చెప్పగా సొంత నిధులు రూ.15 వేలతో రేకులు కొనుగోలు చేసి రేకులు అమర్చడం పూర్తి కావడంతో ఇంటికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా జక్కా లక్ష్మి గద్దె క్రాంతికి, ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి అవకాశాల పెంపు, సంక్షేమ పథకాలు అమలు ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఆర్థికంగా బలపడుతున్నారని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం పారదర్శకతతో, ప్రజల మద్దతుతో ముందుకు సాగుతూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుందన్నారు. ఉపాధి అవకాశాలు పెరగడంతో యువతలో నూతన ఆత్మవిశ్వాసం నెలకొన్నదని, రైతులకు సరైన మద్దతు ధరలు, మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే పథకాలు, చిన్న వ్యాపారులకు రుణ సౌకర్యాలు ఇవన్నీ కూటమి ప్రభుత్వం సంకల్పబలాన్ని ప్రతిబింబిస్తున్నాయన్నారు. ఫలితంగా ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో రాష్ట్రంలో ఆర్థిక చైతన్యం నెలకొనిందని, చిన్న వ్యాపారాల నుండి పెద్ద వ్యాపారాల వరకు ప్రతి రంగంలో చురుకుదనం కనిపిస్తోందని అన్నారు. వివరించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జరిగిన విజయదశమి ఉత్సవాలు, ఇప్పుడు జరిగిన దీపావళి వేడుకలే నిదర్శనం అన్నారు. ప్రతి ఇంటిలో ఆనందోత్సాహాల నడుమ పండుగలు అంగరంగ వైభవంగా జరిగాయని, ప్రజల సంతోషం, ఆర్థిక స్థితి మెరుగుపడినందునే ఇది సాధ్యమైందని గద్దె క్రాంతి తెలియజేశారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజాకేంద్రీకృత నిర్ణయాలు, అభివృద్ధి దిశగా వేస్తున్న ప్రతి అడుగు రాష్ట్ర భవిష్యత్తును ప్రకాశవంతం చేస్తున్నాయని ఆయన తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలోని చక్కటి పరిపాలనతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని గద్దె క్రాంతి అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, యలమంచిలి దేవేంద్ర, అన్నాబత్తుల బాబీ, చిలకలపూడి లక్ష్మి నరసింహా, మల్లా గోవింద్, సైకం సుధీర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

# వజ్రా గ్రౌండ్స్‌లో ఉన్న తాత్కాలిక బాణసంచా దుకాణాలను తనిఖీ



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని వజ్ర గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన తాత్కాలిక బాణసంచా దుకాణాలను డీజీ ఫైర్ సర్వీసెస్ పి.వి. రమణ ఆకస్మిక తనఖీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన 16 బాణసంచా తాత్కాలిక దుకాణాలను అగ్ని ప్రమాదం జరగకుండా భద్రతా కారణాల దృశ్య తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫైర్ సేఫ్టీ మెజర్స్ పై పూర్తి స్థాయిలో తనఖీ నిర్వహించి, వారికి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. బాణసంచా దుకాణదారులు ఏర్పాటు చేసుకున్న ఫైర్ ఎస్టింగుషర్స్ ని ఎలా వాడాలి వంటి అంశాలపై వారిని అడిగి వారి చేత చేయించారు. అంతేకాకుండా అక్కడ వస్తున్న ప్రజలకు దీపావళి సందర్భంగా అగ్నిప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు చేయవలసిన పనులను కరపత్రాలు పంపిణీ చేసి వారికి అవగాహన కల్పించారు. భద్రత అవసరాల దృశ్య వజ్రా గ్రౌండ్లో ఈ 48 గంటల వ్యవధి వరకు ఉంచిన ఫైర్ ఇంజన్, ఫైర్ సేఫ్టీ ఎక్విప్మెంట్ ను పూర్తిస్థాయిలో తనఖీ చేశారు డి.జీ ఫైర్ సర్వీసెస్ పి. వి రమణ. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శంకర్, విజయవాడ నగరపాలక సంస్థ ఫైర్ వింగ్ డి ఎఫ్ ఓ మాలాద్రి, ఎస్ఎఫ్ఒ నరేష్, ఈస్ట్ ఎమ్మార్వో రోహిణి, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రచార ఆర్భాటాలతో ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు గారడీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

### కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

### ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పేవన్నీ అబద్ధాలే



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రచార ఆర్భాటాలతో ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టుగా కనికట్టు గారడి చేస్తూ ప్రజలను మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు తీవ్రంగా విమర్శించారు. స్థానిక వైఎస్ఆర్సిపి కార్యాలయంలో మంగళవారం పిపిపి విధానానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే చెప్పేవన్నీ అబద్ధాలేనని తన హయాంలో నియోజకవర్గానికి జరిగిన అభివృద్ధి ఏంటో చెప్పమని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సిపి హయాంలో రూ.109 కోట్లతో ఏటిమొగ, ఎదురుమొండి బ్రిడ్జి మంజూరు అయిందని టెండర్లు పిలిస్తే ఎన్నికలు రావడం వల్ల కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదన్నారు. ఇప్పటికీ కూటమి ప్రభుత్వం వచ్చి 18 నెలల దాటినా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆ బ్రిడ్జి గురించి పట్టించుకోలేదన్నారు. 17 మెడికల్ కాలేజీలను ఒకేసారి జగన్ ప్రభుత్వం తీసుకొస్తే, వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడానికి చూస్తున్నారని, ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యపరిచేందుకే కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని వైఎస్ఆర్సిపి ప్రారంభించిందన్నారు. గురువారం నుంచి ఈ కార్యక్రమాన్ని నాగాయలంకలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ వైద్యశాలలను ప్రైవేటు వాళ్ళకిచ్చి కూటమి ప్రభుత్వం ఏదో ఘనకార్యం చేసినట్లు గొప్పలు చెప్పుకుంటుందని పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడే ప్రభుత్వ వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిన ప్రైవేటు వ్యక్తులకు అప్పగించిన కూటమి ప్రభుత్వం పేదలకు వైద్య విద్య, వైద్య సేవలు అందకుండా చేసిందన్నారు. విశాఖకు డేటా సెంటర్ రావడం బ్రహ్మాండం అని చెబుతున్నారని దీనివల్ల మనకు వచ్చేవి కేవలం 300 ఉద్యోగాలేనని, కానీ లక్షల్లో ఉద్యోగాలు వస్తున్నాయని ప్రచారం చేస్తున్నారని చెప్పారు. డేటా సెంటర్ ఏర్పాటుకు వ్యతిరేకంగా అమెరికాలో నిరసన కార్యక్రమాలు చేసి అడ్డుకున్న విషయాన్ని మర్చిపోరాదన్నారు. 18 నెలల్లోనే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ఎన్నికల సమయంలో మోసం చేసినట్టుగానే మళ్లీ మోసం చేసేందుకు చంద్రబాబు చూస్తున్నారని రమేష్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా వైఎస్ఆర్సీపీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ(లచ్చి), మండల పార్టీ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల జయగోపాల్(గోపి), యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు చింతలపూడి బాల భాస్కర్(బాలు), ఆర్టిఐ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు తలుపుల సుధాకర్ తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అభివృద్ధి ప్రదాత మండలి వెంకట కృష్ణారావు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అనేక పదవులు అధిరోహించిన అభివృద్ధి ప్రదాత మండలి వెంకట కృష్ణారావు అని మోపిదేవి మాజీ ఎంపీపీ, పెదప్రోలు సర్పంచ్ పొలిమెట్ల ఏసుబాబు అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం వంతెన సెంటర్లో ఎంవీ కృష్ణారావు విగ్రహానికి సర్పంచ్ ఏసుబాబు, పీఏసీఎస్ చైర్మన్ నాదెళ్ల శరత్చంద్రబాబు, ప్రముఖ న్యాయవాది ఆకుల వెంకట్రామయ్య, టీడీపీ, జనసేన గ్రామ అధ్యక్షులు నాదెళ్ల రాజేష్, బాచు శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ మద్దిపట్ల జగన్మోహనరావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏసుబాబు మాట్లాడురీ ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా వివిధ శాఖలను సమర్థవంతంగా నిర్వహించి రాష్ట్ర అభివృద్ధికి అనేక సంస్కరణలు ప్రవేశపెట్టిన ఘనత కృష్ణారావుకే దక్కిందన్నారు. ఆయన బాటలోనే ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా విస్తృత అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధికి బుద్ధప్రసాద్ తండ్రి బాటలో విస్తృత కృషి చేస్తున్నారన్నారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ అవనిగడ్డ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ, మండల అధ్యక్షులు లింగం బాబూరావు, మోపిదేవి మండల కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మానేపల్లి కోటయ్య, గాంధేయవాది గరికపాటి సీతారామయ్య, పెదప్రోలు గ్రామ కూటమి నాయకులు యడ్ల శ్రీనివాసరావు, యడ్లపల్లి లక్ష్మణరావు (బుజ్జి), డోకిపర్తి బాలకోటేశ్వరరావు, దివి యుగంధరి, యడ్లపల్లి యల్లమందయ్య, యడ్లపల్లి నాగమల్లేశ్వరరావు, కొల్లూరి కోటేశ్వరరావు, డోకిపర్తి శ్రీనివాసరావు, కొల్లూరి అప్పారావు, కనపర్తి సుబ్బారావు, మోర్ల జయ నాగ శ్రీనివాసరావు, మోర్ల చిదంబరావు, యార్లగడ్డ ఆనందరావు, పోతార్లంక సుధాకర్, యన్నం వెంకటేశ్వరరావు, యన్నం కల్యాణ చక్రవర్తి, డోకిపర్తి చిట్టిబాబు, మామిడి ముక్తేశ్వరరావు, వడ్డీ శంకరయ్య, నంద్యాల కృష్ణ, వడ్డీ నాగరాజు, లోయ కనక నరేష్, బొర్రా రాఘవులు, మానికొండ రమేష్, నీలా ఆంజనేయులు, బూసి శ్రీనివాసరావు, డొక్కు శ్రీనివాసరావు, కొండూరి రాధాకృష్ణ, కొల్లూరి కోటేశ్వరరావు, నడకుదురు వినోద్ కుమార్, మోర్ల వీర రాఘవులు, మోర్ల గణేష్, మోటుపల్లి రామదాసు, మోటుపల్లి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అంబాపురంలో వల్లభనేని వంశీ జన్మదిన వేడుకలు



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** గన్నవరం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ జన్మదిన వేడుకలు విజయవాడ రూరల్ మండలంలోని అంబాపురం గ్రామంలో వైఎస్ ఆర్ విగ్రహం వద్ద వైసిపి గ్రామ అధ్యక్షుడు నల్లమోతు చంద్ర శేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వల్లభనేని వంశీ అన్ని వర్గాలకు చెందిన వ్యక్తని, ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. కూటమి పార్టీ ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా ఏ మాత్రం బెదరని నైజమే వంశీ అని పేర్కొన్నారు. వల్లభనేని వంశీ మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం వంశీ జన్మదినోత్సవ కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు కొడాలి ప్రవీణ్, పలపాక, దాసు, పైడిముక్క రమేష్, తోడేటి కిరణ్ కుమార్, కొడాలి భరత్, మంచాల విజయ్, సొంగ దయాకర్, ప్రభాకర్ , రవితేజ, సాయి తదితరులు పాల్గొన్నారు.

### నైనవరంలోనూ వంశీ జన్మదిన వేడుకలు



గన్నవరం మాజీ శాసనసభ్యుడు డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ జన్మదినోత్సవ వేడుకలు విజయవాడ రూరల్ మండలం పి నైనవరం గ్రామంలోని వైయస్ఆర్ బొమ్మ సెంటర్లో వైసిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు దావు వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దావు వీర కోటయ్య, వైసిపి నేతలు రామ కృష్ణ, కాళీ దాసు, చేబోయిన నాగేశ్వర రావు, పామర్తి గోవింద్, షేక్ నాగూర్, అన్వర్, మారగానీ పండు, దావూ సర్దార్ తదితరులు పాల్గొన్నారు. ..

# పూర్తి ఆరోగ్యంగా చిన్నారి గీతా సహస్ర

**పెనుగంచిప్రోలు, అక్టోబర్ 21, మేజర్ న్యూస్ :** వైరల్ ఇన్ఫెక్షన్ సోకడంతో చికిత్స తీసుకొన్న చిన్నారి పూర్తిగా కోలుకుందని, గ్రామంలో ఎక్కడా మరో కేసు నమోదు కాలేదని, ప్రజల ఆరోగ్య పరిస్థితి సాధారణంగానే ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ.. వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో కలిసి పెనుగంచిప్రోలులో మూడు గంటలపాటు పర్యటించారు. తొలుత వైరల్ ఇన్ఫెక్షన్ సోకి.. చికిత్సతీసుకొని పూర్తిగా కోలుకున్న చిన్నారి గీతా సహస్ర ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు, స్థానిక ప్రజలతో మాట్లాడారు. స్థానికంగా మంచి నీటి సరఫరా వ్యవస్థను, ట్యాంకును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే ప్రత్యేక బృందాలు రెండు రౌండ్ల ఇంటింటి సర్వేను పూర్తిచేశాయని.. వైద్యాధికారులు మరో 24 గంటలపాటు ఇక్కడ మరో ప్రత్యేక సర్వే నిర్వహిస్తారని తెలిపారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యల గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఏదైనా సమస్య వస్తే వెంటనే ఏఎన్ఎం, ఆశా సహకారంతో స్థానిక వైద్యాధికారులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. కొందరు చిన్న సమస్యలను సైతం తెలిసీతెలియక అవగాహన లేమితో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారని.. దీనివల్ల ప్రజలు కలవరపాటుకు గురవుతున్నారన్నారు. జిల్లాలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సేవలందిస్తున్నారని.. ఎవరైనా సరిగా స్పందించకుంటే తమకు సమాచారమివ్వొచ్చని, అధికారుల బృందాన్ని నేరుగా ఇళ్లకే పంపించడం జరుగుతుందన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని.. ఈ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. ప్రైవేటు ఖాళీ స్థలాల్లో ఇష్టానుసారం చెత్త వేయకుండా, కంపచెట్లు పెరగకుండా చూసేందుకు ఆయా స్థలాల యజమానులకు గ్రామపంచాయతీ ద్వారా నోటీసులు ఇస్తున్నామన్నారు. తాగునీటిని ఎప్పటికప్పుడు పరీక్షించి ప్రజలకు అందించేలా నిర్దిష్ట మార్గదర్శకాలతో అధికారులకు ఆదేశాలిచ్చామన్నారు.

**పీహెచ్సీని తనిఖీ చేసిన కలెక్టర్**

పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (పీహెచ్సీ) కలెక్టర్ లక్ష్మీశ తనిఖీ చేశారు. వివిధ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురు రోగులను పలకరించి.. ఆసుపత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోగిపైనా ప్రత్యేకంగా పర్యవేక్షణ ఉంచి ఆరోగ్య సేవలు అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ ఆసుపత్రి వైద్యాధికారులకు, సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణ, డీఎంహెచ్వో డా. ఎం.సుహాసిని తదితరులు ఉన్నారు.

**ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం..** కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పెనుగంచిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. మండలానికి సంబంధించి వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ నెల 23న కేంద్ర అధికారుల బృందం పెనుగంచిప్రోలు మండలంలో పర్యటించనుందని తెలిపారు. ఆకాంక్షిత బ్లాక్ కార్యక్రమం కింద మండలంలో చేపట్టిన చర్యలు, ఇచ్చిన ఫలితాలను బృందం పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.




## తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగాలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక రాజీవ్ గాంధీ సెంటర్లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశం కోసం తమ ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగస్ఫూర్తి కొత్త తరాలకు ప్రేరణగా నిలుస్తోంది. మనం నేడు అనుభవిస్తున్న స్వేచ్ఛ వారి త్యాగఫలమని ప్రతి పౌరుడు గుర్తుంచుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు పర్చూరు దుర్గాప్రసాద్, బండే రాఘవ, కొండవీటి మధు, ఘంటసాల కన్నయ్య మండలి రామ్మోహన్రావు, మెగావత్ గోపి తదితరులు పాల్గొన్నారు.

## 25వ తేదీ లోపు పంటను ఇ- నమోదు చేసుకోండి

**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** ఇ-పంట నమోదు గడువు ఈనెల 25వ తేదీతో ముగియనున్న తరుణంలో రైతులందరూ తప్పనిసరిగా తమ పంటను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.గణేష్ రెడ్డి విజ్ఞప్తిచేశారు. ఇప్పటివరకు తమ పంట వివరాలను నమోదు చేసుకోని రైతులు ఎవరైనా ఉంటే, వెంటనే తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాలను (ఆర్ ఎస్ కె) సంప్రదించి, తమ పంటల నమోదును తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని కోరారు. నిర్ణీత గడువు తర్వాత నమోదుకు అవకాశం ఉండదని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు గడువును పొడిగించిన తరుణంలో మరోసారి పొడిగించే అవకాశం లేదనే విషయాన్ని రైతులు గమనించాలన్నారు. కావున, రైతులందరూ ఈ విషయాన్ని గమనించి, సకాలంలో తమ పంటలను నమోదు చేసుకోవాలని గణేష్ రెడ్డి కోరారు.

## కార్తీక మాసానికి ముస్తాబవుతున్న శైవాలయాలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఆధ్యాత్మిక మాసంగా పేరొంది శివారాధకులకు అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసం ప్రారంభం కావడంతో దివిసీమ ప్రాంతంలోని శైవాలయాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. కార్తీకమాసం ప్రతి రోజు శివాలయాల్లో జరిగే అభిషేకాలు, దీపారాధనలకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఆలయాల గోపురాలు, మండపాలు విద్యుత్ దీపాలతో అలంకరించబడుతున్నాయి. దివిసీమలోనే ప్రాచీన శివాలయం గా పేరుందిన శ్రీ రాజరాజేశ్వరి సమేత రాజశేఖర స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్నట్ల ఆలయ కార్యనిర్వహణాధికారి వాసు తెలిపారు. ఉదయం పాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తుండగా, సాయంత్రం దీపమాలికలు వెలిగించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మహిళలు దీపధార కార్యక్రమాలకు వీలుగా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మండల పరిధిలోని వేకనూరు, మోదుమూడి, దక్షిణ చిరువోలు లంక గ్రామాల్లోన శివాలయాల్లో కార్తీక శోభ సంతరించుకుంది. భక్తులు కార్తీక సోమవారాలు, త్రిపురారాత్రి, కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించారు. దేవాలయ పరిసరాల్లో శుభ్రతా కార్యక్రమాలు చేపట్టారు. భక్తి ఉత్సాహంతో శివాలయం ప్రాంగణాలు శివనామస్మరణతో మార్మోగుతూ "శివశివ శంకర" నినాదాలతో ఆలయాలు ఆధ్యాత్మిక క్షేత్రాలుగా మారనున్నాయి.



### జీవితాలను త్యాగం చేసిన

# అమరవీరులను స్మరించుకోవడం మన కర్తవ్యం







**మచిలీ పట్నం మేజర్ న్యూస్ :** శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు చూపిస్తున్న ధైర్య సాహసాలు అపూర్వమని, జీవితాలను త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవడం మన కర్తవ్యం అని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.మంగళవారం ఉదయం నగరంలోని పోలీస్ కవాతు మైదానంలో పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ వీ.విద్యాసాగర్ నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొన్నారు. వారు పోలీస్ అమరవీరుల త్యాగాన్ని స్మరిస్తూ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలతో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21 న భారత సరిహద్దు భూభాగంలో 20 మంది పోలీసులు వీరోచితంగా పోరాడారన్నారు. వారిలో 10 మంది పోలీసులు అసువులు బాసారన్నారు. వారి త్యాగనిరతిని స్మరిస్తూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదీన పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో ముష్కరుల బారి నుండి నిరంతరం ప్రజలను రక్షిస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ప్రతి పోలీస్ అమరవీరులకు అంజలి ఘటిస్తూ ఘన నివాళులు అర్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజలను కాపాడుతూ సమాజ పరిరక్షణ కోసం 2024-25 సంవత్సరంలో 151 మంది పోలీసులు దేశవ్యాప్తంగా అసువులు బాయటం జరిగిందని, వారిలో మన రాష్ట్రం నుంచి 5 మంది పోలీసులు ఉన్నారన్నారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. సరిహద్దుల్లో సైనికులు చేసే పోరాటం కన్నా అంతర్గతంగా వైషమ్యాలను తొలగిస్తూ, ప్రజలు సుఖశాంతులతో జీవిస్తున్నారంటే అందుకు మూల కారణం పోలీసులని కచ్చితంగా చెప్పవచ్చున్నారు. పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నిమిత్తం లక్ష రూపాయల విరాళం ప్రకటిస్తూ అందుకు సంబంధించిన చెక్కును రాష్ట్ర మంత్రి జిల్లా ఎస్పీకి అందించారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ దేశ ప్రగతికి, రాష్ట్ర అభివృద్ధికి ప్రాణాలను అర్పించిన ప్రతి పోలీస్ మహనీయునికి కూడా శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా కూడా కనిపించని, అర్థం కాని అంశం శాంతిభద్రతలన్నారు. ఏ ఒక్క కంపెనీ పెట్టుబడి పెట్టాలన్న ఏ ఒక్క కార్యక్రమం సజావుగా జరగాలన్న ఆ దేశంలో శాంతి భద్రతలు ఎలా ఉన్నాయో దానిమేరకు నిర్ధారణ అవుతుందన్నారు. దేశం గాని, రాష్ట్రంగానీ అభివృద్ధి చెందిందంటే దాని వెనక కనిపించని హస్తం పోలీసు వ్యవస్థ అని గట్టిగా నమ్ముతున్నానన్నారు. ఏ దేశంలో పోలీసు వ్యవస్థ పకడ్బందీగా లేదో అక్కడ అన్ని రకాల సమస్యలు ఉండటమే కాకుండా అభివృద్ధి సానుకూలంగా లేకపోవడం మనం చూస్తూ ఉన్నామన్నారు.ఈ నేపథ్యంలో పోలీసు శాఖ పాత్ర చాలా గొప్పదని రాష్ట్రంలో దేశంలో అంతర్గత భద్రతకు ముప్పుగా ఉన్న వామపక్ష ఉగ్రవాదులను అణిచివేయడంలో పోలీసులు చాలా కీలకమన్నారు. గత ఒకటిన్నర సంవత్సరంగా దేశంలో గాని,రాష్ట్ర రాష్ట్రంలో గాని ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందన్నారు. చాలామంది ఉగ్రవాదులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసిపోవడం జరుగుతుందన్నారు. దీని వెనుక పోలీస్ శాఖ త్యాగం పెద్ద స్థాయిలో ఉంటుందన్నారు.జిల్లా ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ పోలీసు అమరవీరుల దినోత్సవం ఎంతో గంభీరంతో గౌరవంతో నిర్వహిస్తున్నామన్నారు. ఇది కేవలం ఒక కార్యక్రమం కాదని పోలీసు కుటుంబాల ఆత్మ గౌరవానికి, ధైర్యానికి, త్యాగానికి చిహ్నం అన్నారు. భారత చైనా సరిహద్దులో లడక్ వద్ద 20 మంది పోలీసు జవాన్లు చైనా దాడికి ఎదురుగా నిలబడ్డారని, అందులో 10మంది పోలీసులు దేశ రక్షణలో ప్రాణాలు అర్పించారన్నారు. వారి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఇది కేవలం చరిత్ర కాదని ప్రేరణనీ, దేశ ప్రజల క్షేమం కోసం తమ జీవితాలను త్యాగం చేసి అమరులైనారన్నారు. మన రాష్ట్రంలో కూడా అనేకమంది పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలర్పించారన్నారు. ఉగ్రవాదులు, దొంగలు, నక్సల్స్, ప్రమాదాలు నుండి ప్రజలను రక్షించే క్రమంలో చాలా మంది పోలీసులు తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. ప్రజలకు న్యాయము, విశ్వాసం కల్పించడం పోలీసుల ధర్మమన్నారు. పోలీసులంటే భయం కాదని విశ్వాసం అని నొక్కి చెప్పారు. ప్రజల కోసం జీవించే వ్యక్తి అని ప్రశంసించారు. మనలో ప్రతి ఒక్కరూ నిజాయితీ, క్రమశిక్షణ, మానవతా విలువలు పాటిస్తే అవే



అమరవీరులకు నిజమైన నివాళి అని చెప్పారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ పోలీసు వ్యవస్థ త్యాగాలకు మారు రూపమని, ఏదైనా సమస్య వస్తే కానిస్టేబుల్ నుండి పోలీసు సూపరింటెండెంట్ వరకు రోడ్డెక్కి నేరస్తులను ఎదిరించి ప్రాణాలను ఫణంగా పెట్టి నిరోధించేవారన్నారు. సామాన్యులకు అన్యాయం జరిగితే పోలీస్ స్టేషన్ వెళదామని ధైర్యంగా చెబుతున్నారంటే వారికి పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం ఉందన్న విషయం గమనించాలన్నారు. పోలీసులు ఎప్పుడు కూడా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. ఎవరికైనా అన్యాయం జరిగితే దాని అంతు తేల్చాలన్నారు. ఉగ్రవాదులతో పోరాటంలో ప్రాణ త్యాగం చేసి పోలీసులు అమరులయ్యారన్నారు. వారందరినీ స్మరించుకో వడం మన కర్తవ్యం అన్నారు. అనంతరం మంత్రి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్ పి జిల్లా పోలీసు అధికారులతో కలిసి అమరవీరుల సంస్మరణ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వివి నాయుడు సత్యనారాయణ డిఎస్పి రాజా మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే నాని, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, మాజీ జెడ్పిటిసి లంకే నారాయణ ప్రసాద్, పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది వారి కుటుంబాలు పాల్గొన్నారు.

## రచ్చబండ - కోటి సంతకాల సేకరణలో మాజీ ఎమ్మెల్యే కైలే



**తోట్లవల్లూరు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని భద్రిరాజుపాలెం గ్రామంలో వైయస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన రచ్చబండ - కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజలకు విద్య, వైద్యం అందుబాటులోకి తేవాలన్న ఒక మంచి ఉద్దేశ్యంతో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడం అంటే దానికి అనుసంధానంగా ఏర్పడే బోధనాసుపత్రులను కార్పొరేట్ శక్తులకు అప్పణంగా కట్టబెట్టడం కిందకే వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను దూరం చేయాలన్న దురుద్దేశంతోనే కూటమి ప్రభుత్వం ఈ కుట్రలకు తెరతీసిందని విమర్శించారు. దీనిని ఎంత మాత్రం సహించే ప్రసక్తే లేదని, అందులో భాగంగానే తమ పార్టీ అధినాయకుడు వైయస్ జగన్ పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతోందన్నారు.

పామర్రు నియోజకవర్గంలో సైతం ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని సంతకాలు చేయడం ద్వారా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు కళ్లెం వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు జొన్నల రామ్మోహన్ రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షురాలు ఈడ్పుగంటి రాజామణి లతోపాటు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యలకుర్రు, ప్రాకర్ల గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ



**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని యలకుర్రు, ప్రాకర్ల గ్రామాల్లో మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఆదేశాల మేరకు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పిటిసి సభ్యురాలు కూనపురెడ్డి స్వరూపరాణి, ఎంపిపి దాసరి అశోక్ కుమార్, వైస్ ఎంపిపిలు ఆరేపల్లి శ్రీని వాసరావు, ఆరుమళ్ళ రమాదేవి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొడాలి సురేష్, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సజ్జా సుబ్రహ్మ ణ్యం, నియోజకవర్గ పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడు నత్తా రవి కుమార్, పామర్రు టౌన్ అధ్యక్షులు నందిపాటి సురేష్ రెడ్డి, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా పార్టీ కార్యదర్శి (యాక్టివిటీ) ముత్యాల నాగరాజు, మండల ప్రధాన కార్యదర్శి పెయ్యల రాజు, మండల కార్యదర్శి కలపాల నాగరాజు, జమీ గోల్వేపల్లి సర్పంచ్ శాంత కుమారి, మండల నాయకులు బట్టు వీరరాఘవులు, బల్లిపర్రు రాణి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు పానే కొండలరావు, ప్రధాన కార్యదర్శి బడుగు నాగరాజు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.
ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999